ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
5
శుక్రవారం 11 ఏప్రిల్ 2025



మిరుదొడ్డిలో నాగయ్యవాగుపై వంతెన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపి

## దుబ్బాక అభివృద్ధికి నా వంతు కృషి

● ఎంపీ రఘునందన్‌రావు

మిరుదొడ్డి, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : తాను రైతుల అభివృద్ధికి అహర్నిషలు కృషిచేయడం జరుగుతుందని, రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం వంతెన నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం మిరుదొడ్డిలో నాగయ్యవాగుపై వంతెన నిర్మాణ పనులకు భూమిపూజను చేసి మాట్లాడారు. దుబ్బాక ఎమ్మెల్యేగా తాను ఉన్నప్పుడు బీఆర్ఎస్ నిధులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టిందని, ఇప్పుడు ఎమ్మెల్యే ప్రభాకర్‌కి కూడా అదే పరిస్థితి నెలకొన్నదని స్పష్టం చేశారు. గెయిల్ పరిశ్రమకు వచ్చిన లాభంలో భాగంగా వంతెన నిర్మాణ పనులకు నిధులను ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో నెలకొన్న భూసమస్య పరిష్కారానికి తనవంతుగా కృషిచేస్తానని వెల్లడించారు. దుబ్బాక నియోజకవర్గంలోని తొమ్మిది గ్రామాల మాజీ సర్పంచుల విన్నపం మేరకు నాగయ్యవాగుపై వంతెన నిర్మాణ పనులను శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. తాను చేసిన అభివృద్ధి పనులను బీఆర్ఎస్ చేసిందని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అమర్, నాయకులు దేవరాజు, మల్లేశం, రోశయ్య, శ్రీనివాస్, ప్రవీణ్, యాదగిరి, రవీందర్ తదితరులున్నారు.

## సన్న వడ్లను దళారులకు విక్రయించొద్దు : కలెక్టర్



నర్సాయపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలిస్తున్న కలెక్టర్

మద్దూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన సన్నవడ్లను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలని కలెక్టర్ మనుచౌదరి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని నర్సాయపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి నిర్వాహకులు, రైతులతో మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడకుండా మండల కేంద్రం నుంచి టార్పాలిన్ కవర్లు తెచ్చుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు అధిక ప్రాధాన్యతను ఇస్తుండటంతో పాటు బోనసు కూడా ప్రకటించిందన్నారు. సన్న వడ్లను దళారులకు విక్రయించరాదని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరతో పాటు బోనసు అందుకోవాలని రైతులకు సూచించారు. తూకంలో తేడాలు రాకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాంమోహన్, ధూలిమిట్ట ఇన్‌చార్జి ఎంపీడీవో వీరరాజు, ఏవో రామకృష్ణ, ఆర్ఐ రమేష్, సీసీ సిద్దిమల్లయ్య, వెంకటేష్, సెంటర్ నిర్వాహకులు ఉన్నారు.

# ఆగమాగం

● జిల్లాలో వడగళ్ల వాన ● ఈదురుగాలులకు నేలరాలిన ధాన్యం, మామిడికాయలు
● 9,149 ఎకరాల్లో పంటలకు నష్టం
● అంచనా వేసిన వ్యవసాయాధికారులు ● పరిహారం అందించాలని అన్నదాతల డిమాండ్



చిన్నకోడూరు మండలం ఎల్లాయిపల్లిలో నేలరాలిన మామిడికాయలు

సిద్దిపేటకలెక్టరేట్/మద్దూరు/చిన్నకోడూరు/చేర్యాల/నంగునూరు ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైతన్నపై ప్రకృతి కన్నెర్ర చేసింది. చేతికొచ్చిన పంటలను నామరూపాల్లేకుండా తుడిచిపెట్టేసింది. ఈదురుగాలులు, వడగండ్ల ధాటికి కోతకు వచ్చిన వరిగింజలు, మామిడికాయలు నేలరాలాయి. మొక్కజొన్నను నిండా ముంచింది. గురువారం తెల్లవారుజామున దాదాపు 3 గంటల సమయంలో కురిసిన వడగండ్ల వాన కురవడంతో జిల్లాలో పంటలకు తీవ్ర నష్టం మిగిల్చింది.





నంగునూరు మండలం నర్మెటలో వర్షానికి నేలరాలిన వరి



ఆకునూరులో తడిసిన ధాన్యంరాశులు

### మండలాల్లో ఇలా..

మద్దూరు మండలంలో గురువారం తెల్లవారుజామున 4 గంటలకు పదిహేను నిమిషాల పాటు ఈదురుగాలులతో కురిసిన వడగళ్ల వర్షం చేతికందే పంటల్ని నేలపాలు చేసింది. నర్సాయపల్లిలో సుమారు 450 ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 60 ఎకరాల్లో పంట నష్టం వాటినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. నంగునూరు మండల పరిధిలో గురువారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పాలమాకుల సహకార సంఘం సమీపంలోని భారీ వృక్షం భవనంపై కూలిపోయింది. పాలమాకులలో భారీ వడగండ్ల దెబ్బకు ఆరబోసిన వడ్లు బియ్యంగా మారాయి. వెంకటాపూర్‌లో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. రాజగోపాలపేట ముండ్రాయి గ్రామాల మధ్య భారీ సైజులో వడగండ్లు పడ్డాయి. సుమారుగా తొమ్మిది గ్రామాల్లో 100 శాతం పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. భారీ వడగండ్లతో పంటలు నష్టపోయిన ప్రాంతాలను మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పరిశీలించి అధికారులకు నివేదికలు అందజేశారు. చేర్యాల మండలం దానంపల్లి, కమలాయపల్లి, ఆకునూరు, దొమ్మాట, రాంపూర్ గ్రామాలలో గురువారం తెల్లవారుజామున అకాలవర్షం కురిసింది. దీంతో ఆయా గ్రామాలలో వడగండ్లతో ధాన్యం నేలరాలి వరిపంటలు దెబ్బతిన్నాయి. దీంతో అపారనష్టం సంభవించడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పరిహా రం అందించాలని వేడుకుంటున్నారు. కాగా చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలోని కొనుగోలుకేంద్రంలో ధాన్యం తడిసింది.



చిన్నకోడూరు మండలంలో కురిసిన వడగళ్లు

### పంటలను పరిశీలించిన అధికారులు, నాయకులు

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను జిల్లా వ్యవసాయాధికారి రాధిక, ఏడీఏలు, ఏవోలతో పాటు ఏఈవోలు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టం వివరాలను ప్రాథమికంగా అంచనా వేశారు. వర్షం కురిసిన గ్రామాల్లో పర్యటించి పంట నష్టం వివరాలు సేకరించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో 4,926 మంది రైతులకు 9149.13 ఎకరాల్లో పంట నష్టం ప్రాథమిక ఇంచానవేశారు. అత్యధికంగా వరి 6321.13 ఎకరాల్లో నష్టం జరగ్గా, ఆ తర్వాత మొక్కజొన్న 33 ఎకరాల్లో మామిడికి 1,141 ఎకరాల్లో, ఉద్యానవన పంటలు 1,654 ఎకరాల్లో పంటలు నష్టపోయాయని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు.

చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. గ్రామాల్లో వరి రాలిపోయింది. కీరదోస, కూరగాయ తోటలు దెబ్బతిన్నాయి. గురువారం వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించారు. మండలంలోని ఎల్లాయిపల్లిలో వర్షానికి దెబ్బతిన్న వరి పంటను డీఏవో రాధిక, సిద్దిపేట ఏడీఏ పద్మ, ఏవో జయంత్‌కుమార్ పరిశీలించారు. 9 గ్రామాల్లో 1,230 మంది రైతులకు చెందిన 2,110 ఎకరాల్లో వరి పంట దెబ్బ తిన్నట్లు ఏవో జయంత్ కుమార్ తెలిపారు. అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కాముని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పంటలను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. మద్దూరు మండలం నర్సాయపల్లిలో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి బి. రామకృష్ణ పరిశీలించారు. గ్రామంలో సుమారు 80 ఎకరాలలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈవో రాజు, అఖిల్‌తో పాటు రైతులు ఉన్నారు. చేర్యాల మండలం దానంపల్లి, కమలాయపల్లి, అర్జునపట్ల గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను గురు వారం వ్యవసాయశాఖాధికారులు పరిశీలించారు. వ్యవసాయాధికారి పులి భోగేశ్వర్ పర్యటించి బాధిత రైతులతో మాట్లాడి పంటనష్టం పరిశీలించారు. మూడు గ్రామాల్లో 185 ఎకరాల నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు.



చేర్యాల మండలం దానంపల్లిలో నేలరాలిన ధాన్యం

### పిడుగుపాటుకు పాడి ఆవు మృతి

చేర్యాల మండలం ముస్త్యాలకు చెందిన కేసిరెడ్డి సురేందర్‌రెడ్డి వ్యవసాయబావి వద్ద తెల్లవారుజామున పడిన పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు.



ఎల్లాయిపల్లిలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న డీఏవో రాధిక, ఏడీఏ పద్మ



చేర్యాల మండలం ముస్త్యాలలో పిడుగుపాటుకు మృతిచెందిన ఆవు



విద్యుత్ సేవలకు
## లైన్ క్లియర్
● ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ యాప్
● అందుబాటులోకి తీసుకొచ్చిన టీజీఎస్‌పీడీసీఎల్
● అనుమతి నుంచి రిటర్న్ వరకు యాప్‌లోనే 7

చంద్రబాబు పింఛన్ పెంచారు..
## రేవంత్‌రెడ్డి ఇవ్వకపోతే గద్దె దిగిపోయే రోజు తీసుకువస్తా
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ 7

పెండింగ్‌లో
## 'బాస్' బిల్లులు
● మూడేళ్లుగా మంజూరు కాని నిధులు
● సిద్దిపేట జిల్లాలో ఆరు పాఠశాలలు
● రూ.4.73 కోట్లు మంజూరు కాకపోవడంతో పాఠశాలల యాజమాన్యానికి ఇబ్బందులు 6





## వృథాగా నీరు

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మెదక్ బైపాస్ రోడ్డులోని శ్రీ చైతన్యస్కూలుకు ఎదురుగా ఉన్న మిషన్ భగీరథ వాల్వ్ గురువారం లీకైంది. దాదాపు 3 గంటల పాటు నీరు వృథాగా పోయింది. గమనించిన స్థానికులు సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సరఫరా నిలిపివేశారు.

- సిద్దిపేట ఫొటోగ్రాఫర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి)



# విద్యార్థులకు మోకాళ్ల దండన

● బూట్లు వేసుకురాలేదని, జడలకు రిబ్బన్లు కట్టుకోలేదని మోకాళ్లపై కూర్చోబెట్టిన ఉపాధ్యాయులు

బెజ్జంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలకు బూట్లు (షూష్) వేసుకుని రాలేదని, విద్యార్థులు జడలకు రిబన్లు కట్టుకోలేదని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులను సుమారు గంట పాటు పాఠశాల ఎదుట మోకాళ్లపై కూర్చుబెట్టారు. ఈ సంఘటన బెజ్జంకి అనుబంధ గ్రామమైన ఎల్లంపల్లి మోడల్ స్కూల్‌లో గురువారం చోటుచేసుకుంది. ఒంటిపూట బడులు కావడంతో విద్యార్థులు ఉదయాన్నే మండలంలోని ఆయా గ్రామాల నుంచి ప్రైవేట్ వాహనాల్లో పాఠశాలలకు వస్తుంటారు. ఈ క్రమంలో విద్యార్థులు పాఠశాలకు ఆలస్యంగా వచ్చారని, షూష్ వేసుకుని రాలేదని, విద్యార్థినుల జడలకు రిబ్బన్లు లేవని పలు రకాల కారణాలు చూపుతూ వారిని మోకాళ్లపై కూర్చోబెట్టారు. అయితే, ప్రతి రోజు ఇలాంటి సంఘటనలే జరుగుతున్నాయని విద్యార్థులు తల్లిదండ్రులతో వాపోతున్నారు. ఈ విషయమై జిల్లా విద్యాధికారిని 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో సంప్రదించగా విద్యార్థులందరూ సమానంగా ఉండాలనే ఉద్దేశంతో యూనిఫామ్స్ వేసుకోని రావాలని చెబుతున్నామని, షూష్, జడలకు రిబ్బన్లు వేసుకుని రావాలని తాము చెప్పలేదని తెలిపారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తామని పేర్కొన్నారు. గతంలో కూడా పాఠశాల పీఈటీ తొమ్మిదో తరగతి విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇటీవల గుగ్గిళ్ల గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని ఉపాధ్యాయురాలు చితకబాదడంతో ఆస్పత్రిపాలయ్యాడు. ఈ సంఘటనపై సదరు విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాల ఉపాధ్యాయులు క్షమాపణ చెప్పినట్లు తెలిసింది. ఇలాంటి సంఘటనలు మోడల్ స్కూల్‌లో నిత్యకృత్యంగా మారాయని విద్యార్థులు వాపోతున్నారు. మోడల్ స్కూల్‌కు వెళ్లాలంటేనే విద్యార్థులు భయపడుతున్నారు. జరిగిన సంఘటనలపై విద్యాశాఖ ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



బెజ్జంకి అనుబంధ గ్రామమైన ఎల్లంపల్లి మోడల్ స్కూల్‌లో మోకాళ్లపై కూర్చున్న విద్యార్థులు



అంగన్‌వాడీ కేంద్రంలో అదనపు కలెక్టర్
## కుమారుడి పేరు నమోదు

కొండపాక మండలం దుద్దెడ పరిధిలోని శేలంపు అంగన్‌వాడీ కేంద్రంలో అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ తన కుమారుడు రిశాన్ అగ్రవాల్ టిన్న పేరును నమోదు చేసుకున్నారు. గురువారం గ్రోత్ మానిటరింగ్ నమోదు చేయించారు. ఈ మేరకు ఎత్తు, బరువు నమోదు చేసి గ్రోత్ మానిటరింగ్ కార్డును ప్రభుత్వం పిల్లలకు అందించే పౌష్టికాహారమైన బాలామృతాన్ని కొండపాక సెక్టర్ సూపర్‌వైజర్ ఇందిరా అంగన్‌వాడీ టీచర్ బాలలక్ష్మి అదనపు కలెక్టర్ గరిమాకు అందజేశారు.

- కొండపాక, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి)



## బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేయాలి

● పనుల్లో నిర్లక్ష్యం తగదు : ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేర్యాలలోని గాంధీచౌరస్తా వద్ద నత్తనడకన కొనసాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను గురువారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. బ్రిడ్జి పనులు చేపట్టి చాన్నాళ్లు అవుతున్నా అర్థాంతంగా రోజులతరబడి ఆపేస్తుండడంతో దుమ్మూధూళితో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఇటీవల ఆంధ్రజ్యోతిలో "ఇంకెన్నాళ్లు" శీర్షికన ప్రత్యేక కథనం ప్రచురితం చేసింది. కథనానికి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందించి గురువారం బ్రిడ్జి పనులు పరిశీలించారు. పనుల్లో జాప్యం కారణాలతో పాటు స్థానికులు, చుట్టుపక్కలవారు పడుతున్న ఇబ్బందులు అడిగితెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. పనుల్లో జాప్యం జరుగుతుండటంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, నిర్లక్ష్యం తగదంటూ చురకంటించారు. కడవేరుగు, నాగపురి దారిలో నెలకొన్న ఇక్కట్లతో పాటు స్థానిక కుడిచెరువుకు వెళ్లే మార్గాలకు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారని అడిగారు. వారంలోగా మళ్లీ తాను చేర్యాలకు వస్తానని, ఆలోగా పనుల్లో పురోగతిపై చర్చించడంతో పాటు బ్రిడ్జితో పాటు రోడ్డునిర్మాణానికి సంబంధించిన మ్యాపులతో రావాలని సూచించారు. పనులు వేగవంతం చేయించి త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. ఈ మేరకు 45 రోజులలో పనులు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కాగా బ్రిడ్జి నిర్మాణం పనుల నేపథ్యంలో కడవేరుగు దారిలోని జనావాసాలకు తాగునీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వెలిబుచ్చగా, మునిసిపల్ కమీషనర్ నాగేందర్‌ను ఆదేశించారు.

## అట్టహాసంగా కీర్తన, నగర ప్రదక్షిణ

నారాయణఖేడ్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ పట్టణంలోని పురాతనమైన రామాలయంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా గురువారం నగర ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. మహిళలు కలశాలు, తులసీ కోటలు తలలపై ఉంచి, పట్టణంలో హరినామ కీర్తన చేస్తూ ప్రదక్షిణ చేశారు. అనంతరం అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతిమహరాజ్ కీర్తన నిర్వహించారు.



# పెండింగ్‌లో 'బాస్' బిల్లులు

**మూడేళ్లుగా మంజూరు కాని నిధులు**

**సిద్దిపేట జిల్లాలో ఆరు పాఠశాలలు**

**రూ.4.73 కోట్లు మంజూరు కాకపోవడంతో**

**పాఠశాలల యాజమాన్యానికి ఇబ్బందులు**

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీమ్(బాస్)కు మూడేళ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతో పాఠశాలలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు లేమీతో సతమతమవుతున్నామని పాఠశాల యాజమాన్యాలు ఇప్పటికే నిరసన బాట పట్టాయి.

సిద్దిపేట జిల్లాలో ఆరు పాఠశాలలను బెస్ట్ అవైలబుల్ కింద ఎంపిక చేశారు. సిద్దిపేటలో వికాస్, శ్రీవాణి, బ్రిలియంట్ హైస్కూళ్లు, బెజ్జంకిలో విద్యానికేతన్, గజ్వేల్‌లో శ్రీసాయి, సెంట్‌మేరీస్ పాఠశాలలను ఎంపిక చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వసతితో పాటు డేస్ స్కాలర్‌లకు ఈ పథకం ద్వారా అవకాశం ఉంది. హాస్టల్ విద్యార్థికి సంబంధించి ఒక్కో విద్యార్థికి రూ.42,000, డే స్కాలర్‌కు సంబంధించి రూ.28,000 చొప్పున ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. బెస్ట్ అవైలబుల్ పాఠశాలల కోసం ప్రభుత్వం ఏటా కొన్ని నిధులను విడుదల చేస్తోంది. మూడేళ్లుగా నిధులు విడుదల కాకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు ఆందోళనకు గురవుతున్నాయి. నిధుల విషయమై నిరసన తెలిపి గతంలో చాలాసార్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండాపోయింది.

### అందుబాటులో లేని అధికారి

ఆరు పాఠశాలలలో 2021 - 22 సంవత్సరానికి గానూ 398 విద్యార్థులు, 2022-23 సంవత్సరానికి గానూ 485 విద్యార్థులు, 2024-25 సంవత్సరానికి 578 విద్యార్థులు ఈ పథకం కింద ఎంపికయ్యారు. 2022 సంవత్సరానికి రూ.1.90 కోట్లు, 2023 సంవత్సరానికి రూ.2 కోట్లు, 2024 సంవత్సరానికి రూ.83 లక్షల నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా రూ.4.73 కోట్లు మంజూరు కావాల్సి ఉంది. అయితే, ఇందులో రూ.70 లక్షల నిధులను మంజూరు చేసినప్పటికీ ఇంకా పాఠశాలల అకౌంట్‌లలో జమ కాలేదు. సిద్దిపేట జిల్లా ఎస్‌సీడీడీ అధికారి రెండు నెలల నుంచి సెలవులపై ఉందని తెలిసింది. ఇన్‌చార్జి అధికారి కూడా అందుబాటులోకి రాలేదు. కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా బెస్ట్ అవైలబుల్ పాఠశాలకు సంబంధించి ప్రతీ ఏటా జిల్లా కార్యాలయం నుంచి ప్రభుత్వానికి రికార్డు పంపుతున్నామని, సర్కారు నుంచే నిధులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.



బాస్ పథకానికి ఎంపికైన సిద్దిపేటలోని పాఠశాల

### పాఠశాలలను నిర్వహించలేకపోతున్నాం

ఒక్కో పాఠశాలకు లక్షల రూపాయలు పెండింగ్‌లో ఉండడం వలన పాఠశాల నిర్వహణ భారంగా మారుతోందని యాజమాన్యాలు వాపోతున్నాయి. నిధులు విడుదల చేసి తమను ఆదుకోవాలని కోరుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో వందల సంఖ్యలో పాఠశాలలు ఉన్నప్పటికీ తమ పాఠశాలలను ఎంపిక చేయడం, నిధులు మంజూరు చేయకపోవడం ఎంతో ఇబ్బందిగా ఉందని యాజమాన్యాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి విద్యార్థులకు, యాజమాన్యాలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వారు కోరుతున్నారు.



## యువకుడి ఆత్మహత్యాయత్నం.. సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్



రాజుకు సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ విష్ణువర్దన్

శివ్వంపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని ఓ కానిస్టేబుల్ సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన ఘటన గురువారం శివ్వంపేట మండల పరిధిలోని దేవమ్మగూడెం తండాలో చోటు చేసుకున్నది. కుటుంబసభ్యుల వివరాల ప్రకారం.. మండల పరిధిలోని దేవమ్మగూడెం తండాకు చెందిన లూస్నావత్ రాజు(30) దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. గురువారం మద్యం తాగి కుటుంబసభ్యులతో గొడవకు దిగగా, వారు మందలించారు. దీంతో ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి, ఇంట్లో బెడ్రూంకు వెళ్లి తలుపులు వేసుకున్నాడు. కుటుంబీకులు 108కు కాల్ చేయగా వెంటనే స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకున్నారు. బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్ తలుపులు ధ్వంసం చేసి ఉరేసుకుని స్పృహ కోల్పోయిన రాజుకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు. దీంతో పోలీసులకు రాజు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎట్టకేలకు చిక్కాడు

- వ్యాపారులకు, పోలీసులకు కునుకు లేకుండా చేసిన నిందితుడి అరెస్ట్
- రెండుసార్లు జైలుకెళ్లినా మారని తీరు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : హమ్మయ్యా.. దొంగ దొరికాడు.. వ్యాపారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. సంగారెడ్డి పట్టణంలో నెల రోజులుగా వివిధ వ్యాపార సంస్థల్లో దొంగతనాలకు పాల్పడుతూ ఇటు వ్యాపారులకు, అటు పోలీసుల కంటికి కునుకు లేకుండా చేసిన దొంగను సంగారెడ్డి పట్టణ పోలీసులు ఎట్టకేలకు గురువారం పట్టుకున్నారు. పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం ఇబ్రాహీంబాద్ తండాకు చెందిన ముడావత్ అంజా(26) చెడు అలవాట్లకు బానిసయ్యాడు. సంగారెడ్డిలోని వీరభద్రనగర్‌లో ఒక అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మార్చి 26న రాత్రి 11 గంటలకు సంగారెడ్డి పట్టణంలోని కేశవ మెడికల్ షాప్, కేశవ పాలిక్లినిక్‌లో టివిని, రూ.60 వేల నగదు దొంగిలించాడు. మార్చి 30న రాత్రి 11 గంటల ప్రాంతంలో కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న అశోక్ కిరాణషాప్‌లో లైఫ్‌బాయ్ సబ్బులు, పారాచ్యూట్ ఆయిల్, ఐదు లీటర్ల వంటనూనె, మరికొన్ని వస్తువులు చోరీ చేశాడు. ఈనెల 7న రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా ఉన్న స్మార్ట్‌ఫ్యాషన్ డ్రెస్సుల షాపులో నగదుతో పాటు దుస్తులను దొంగతనం చేశాడు. గురువారం ఉదయం సిమ్లా బేకరీ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండగా నిందితుడు అంజాను పోలీసులు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. అంజా నుంచి రూ.1370 నగదు, ఐదు లీటర్ల సన్‌ఫ్లవర్ ఆయిల్, నాలుగు లైఫ్‌బాయ్ సబ్బులు, 175 మి.లీ. పారాచ్యూట్ ఆయిల్, ప్లాస్టిక్ టిన్స్ పది స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రాహీంబాద్ తండాకు చెందిన ముడావత్ అంజా(26) తండ్రి గన్య లివర్ వ్యాధితో 2020లో చనిపోయాడు. తల్లి సక్కుబాయి మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. దీన్ని సహించని అంజా తల్లి సక్కుబాయిని గతేడాది హత్య చేశాడు. ఈ కేసులో జైలుకు వెళ్లి తిరిగి బెయిల్‌పై బయటకు వచ్చాడు. తర్వాత నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం చేసి ఈఏడాది ఫిబ్రవరి 13న మళ్లీ జైలుకు వెళ్లాడు. మార్చి 5న విడుదలయ్యాడు. మార్చి 11న తన భార్య స్వాతికి ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించి తన తల్లిగారింటి వద్ద దింపాడు. సంగారెడ్డిలోని వీరభద్రనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ పట్టణంలో దొంగతనాలకు పాల్పడ్డాడు. చివరకు పోలీసులకు చిక్కి మరోసారి జైలుకు వెళ్లాడు.

## ఏఐతో ఉజ్వల భవిష్యత్తు

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి) : కృత్రిమ మేధతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో హత్నూర అంబేడ్కర్ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆమె గురువారం పది కంప్యూటర్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏఐ ఆధారిత విద్యాబోధనను ప్రారంభించాలనే ఉద్దేశంతో విద్యార్థులు ఎక్కువగా ఉన్న 15 పాఠశాలలను ఎంపిక చేసి వాటికి కంప్యూటర్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, సెక్టోరియల్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రేసా అధ్యక్షుడు గంగాధర్, సెక్రటరీ కిరణ్, కార్యవర్గసభ్యులు, ఏవో, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**క్రైం కార్నర్**

## గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతు మృతి

కొల్చారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంతో ఢీకొట్టగా ఓ రైతు మృతిచెందిన సంఘటన జోగిపేట ప్రధాన రహదారి ఎనగండ్ల శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకున్నది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో రంగంపేట గ్రామానికి చెందిన ఊరడి ఎల్లయ్య(55) సాయంత్రం పొలానికి వెళ్లి, గడ్డి కోసి మూటను నెత్తిపై పెట్టుకుని రోడ్డు దాటుతున్నాడు. ఇదే సమయంలో దుంపలకుంట చౌరస్తా నుంచి వస్తున్న టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనం ఎల్లయ్యను ఢీకొట్టింది. రోడ్డుపై పడ్డ ఎల్లయ్య తల వెనుక భాగంలో తీవ్ర గాయమై రక్తస్రావమైంది. దీంతో అతన్ని ప్రైవేట్ వాహనంలో వైద్యం కోసం మెదక్ తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించగా అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో మృతిచెందాడు. ఎల్లయ్యకు భార్య కూతురు, కుమారుడు ఉన్నారు. ఎల్లయ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### దైవ దర్శనానికి వచ్చి తిరిగి వెళ్తూ..

## రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

కుకునూరుపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఓ కుటుంబం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా కారు అదుపుతప్పి స్తంబాన్ని ఢీకొట్టడంతో బాలుడు మృతిచెందిన సంఘటన లకుడారం రాజీవ్ రహదారిపై చోటుచేసుకున్నది. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన కథనం మేరకు.. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన బాబీ కుటుంబ సభ్యులు గురువారం ఉదయం వేములవాడ ఆలయానికి వెళ్లి దైవ దర్శనం చేసుకుని మధ్నాహ్నం తిరిగి వస్తున్నారు. మండలంలోని లకుడారం శివారులో రాజీవ్ రహదారిపై కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న స్తంబాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలు కాగా, బాబి కుమారుడు కార్తీక్(8) అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వారిని పోలీసులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

జోగిపేట రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మన్సాన్‌పల్లి గ్రామ శివారులో గురువారం నాడు చోటుచేసుకున్నది. జోగిపేట ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్ మండలం మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి కిష్టయ్య గ్రామ సమీపంలోని చెరువులో బుధవారం చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతిచెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కిష్టయ్య మృతదేహాన్ని గురువారం బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## కడుపునొప్పి భరించలేక ఒకరి ఆత్మహత్య

కోహీర్ ఏప్రిల్ 10: (ఆంధ్రజ్యోతి) కడుపునొప్పి బాధ భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కోహీర్ మండలంపరిధిలో చోటుచుసుకున్నది. కోహీర్ ఎస్‌ఐ గోపతి సతీష్‌వర్మ కథనం ప్రకారం.. మండలంలోని కొత్తూరు(కే) గ్రామానికి చెందిన బెస్త జనార్దన్(58) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నప్పటికిని తగ్గలేదు. బుధవారం మధ్యాహ్నం కడుపునొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జనార్దన్ భార్య అనుషమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపతి సతీష్ వర్మ తెలిపారు.

## ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

హవేళిఘణపూర్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. ఔరంగాబాద్ గ్రామానికి చెందిన ఆడెపు ధన్‌రాజ్(33) వ్యవసాయం చేస్తూ తల్లిదండ్రులతో కలిసి జీవించేవాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులకు తాళలేక మద్యానికి బానిసయ్యాడు. తల్లిదండ్రులు బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం ఇంటికి వచ్చిన కుటుంబీకులకు కిందికి దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. ధన్‌రాజ్ తండ్రి సిద్దిరాములు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ధన్‌రాజ్‌కు భార్య, నాలుగు నెలల కుమారుడు ఉన్నారు.

## హైవే 161పై గంటల వ్యవధిలోనే రెండు రోడ్డు ప్రమాదాలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 10. (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండలంలోని 161వ జాతీయ రహదారిపై మూడు కిలోమీటర్ల దూరంలోనే గురువారం ఉదయం గంటల వ్యవధిలో రెండు రోడ్డు ప్రమాదాల్లో చోటుచేసుకున్నాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం పెద్దశంకరంపేట వైపు కారులో వెళ్తున్న క్రమంలో అల్లాదుర్గంలోని సబ్‌స్టేషన్ సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడటంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. వారిని హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే, మండలంలోని కాయిదంపల్లి గ్రామ శివారులో హైదరాబాద్ నుంచి పెద్దశంకరంపేట వైపు వెళ్తున్న బొల్లెరో వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో ఈ వాహనంలో ఉన్న ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

### తారా కళాశాలలో

## ముగిసిన జాతీయ సెమినార్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామాజిక శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో 'పబ్లిక్ పాలసీని రూపొందించడంలో సామాజిక శాస్త్ర పాత్ర- బహుళ విభాగ దృక్పథం' అనే అంశంపై రెండురోజుల పాటు నిర్వహించిన జాతీయ సెమినార్ గురువారం ముగిసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్, సదరన్ రీజినల్ సెంటర్ వారి ఆర్థిక సహకారంతో నిర్వహించిన సెమినార్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పరిశోధకులు టెక్నికల్ సెషన్స్‌లో తమ పరిశోధనా పత్రాల ద్వారా పబ్లిక్ పాలసీ ఏ విధంగా ఉండాలి, రూపకల్పనలో సామాజిక శాస్త్రాల పాత్ర ఏమిటి, అభివృద్ధికి, పబ్లిక్ పాలసీకి మధ్య వైరుధ్యాలు ఏ విధంగా ఉన్నాయి, వాటి మధ్య అంతరాలను తొలగించుటకు ఎటువంటి చర్యలు తీసుకోవాలో చర్చించారు. పరిశోధకులు రాజకీయ నిర్ణయాలు, వాటి అమలు విధానాలు సరియైన విధంగా ఉండేటట్టు పబ్లిక్ పాలసీ ఉండాలని, పబ్లిక్ పాలసీ రూపకల్పనలో ఆర్థిక వనరులు, రాజకీయ నిర్ణయాలు, పాలనాపరమైన అడ్డంకులు, దానికి ఉన్న చారిత్రక నేపథ్యాలు మొదలగు వాటిని పరిగణలోకి తీసుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐసీఎస్‌ఎస్‌ఆర్ సదరన్ రీజినల్ సెంటర్ హానర్ డైరెక్టర్ ప్రొ.సుధాకర్‌రెడ్డి, గోపినాథ్‌రెడ్డి, రాములు, కమ్రోద్దీన్, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, సెమినార్ కన్వీనర్ మల్లిక, జగదీశ్వర్, నిర్మల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హరీశ్‌రావు వ్యాఖ్యలు తగవు

- బహిరంగ క్షమాపణ చెప్పాలి
- సీఎం, డిప్యూటీ సీఎం అధికారాలను కుక్క తోకతో పోల్చడంపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం
- పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



పటాన్‌చెరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : రాజకీయ లబ్ధి కోసం సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై మాజీ మంత్రి హరీశ్‌రావు రుద్రారం గణేష్ ఆలయం వద్ద చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా ప్రజల ఓట్లతో గెలిచిన సీఎం, ఉపముఖ్యమంత్రిపై హరీశ్‌రావు చేసిన అభ్యంతకరమైన వ్యాఖ్యలపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 'రాష్ట్రంలో అధికారం ఎవరు చలాయిస్తున్నారో తెలియడం లేదని, కుక్క తోకను ఊపుతోందా.. తోక కుక్కను ఆడిస్తుందా' అని హరీశ్‌రావు పేర్కొనడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు. సీఎం, దళిత డిప్యూటీ సీఎంను కుక్కతోకతో పోల్చడం హరీశ్‌రావు వివేకానికే వదిలివేస్తున్నామన్నారు. వెంటనే హరీశ్‌రావు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అతిక్, ఉపాధ్యక్షుడు యువరాజ్, నాయకులు అశోక్‌ముదిరాజ్, సాయిలు, జాన్సన్, అక్షిత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సేవలకు లైన్ క్లియర్

ప్రమాదాలకు చెక్ పెట్టేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ యాప్
అందుబాటులోకి తీసుకొచ్చిన టీజీఎస్పీడీసీఎల్
అనుమతి నుంచి రిట్నర్ వరకు యాప్‌లోనే




మెదక్ అర్బన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ మరమ్మతుల్లో మానవ తప్పిదాలు, ప్రమాదాల నివారణతోపాటు వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ సంస్థ ప్రత్యేకంగా ఆన్‌లైన్ లైన్ క్లియర్ (ఎల్‌సీ) యాప్‌ను రూపొందించింది. ఎల్‌సీ తీసుకొని పనులు చేపడుతున్న సమయంలో ఒక ఫీడర్‌కు బదులు మరో ఫీడర్ ఎంచుకోవడం, సమాచార లోపం తదితర కారణాలతో ఉద్యోగులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిని నివారించేందుకు యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

**యాప్‌లోనే అన్నీ..**

ఇక నుంచి విద్యుత్ సిబ్బంది లైన్ క్లియర్ యాప్‌ను తప్పక ఉపయోగించాలి. విద్యుత్ సరఫరా పనులకు ఎల్‌సీ తీసుకోవాలనుకునే లైన్‌మన్ ముందుగా యాప్‌ను ఓపెన్ చేసి అందులో సంబంధిత ఫీడర్‌లో ఏఈకి విన్నవించాలి. ఏఈ లైన్‌మన్ రిక్వెస్ట్‌ను పరిశీలించి ఆ ఫీడర్‌లో ఎల్‌సీ ఇవ్వొచ్చా, లేదా.. అత్యవసరమా.. మరే ఇతర షెడ్యూల్ చేయబడిన పనులు ఉన్నాయా అని ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. పరిస్థితులు అనుకూలిస్తే ఏఈ యాప్ ద్వారానే అనుమతి ఇస్తారు. ఇదే యాప్ ద్వారా సంబంధిత లైన్‌మన్‌కి సమాచారం వెళ్తుంది. అలాగే సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు ఏ ఫీడర్ ఇవ్వాలో యాప్ ద్వారా తెలుస్తోంది. ఎల్‌సీ ఇవ్వాల్సిన సమయంలో సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఏమరపాటుగా చేసే పొరపాట్లను నివారించుటకు యాప్ తగు సూచనలు, జాగ్రత్తలు తెలియజేస్తోంది. హెల్మెట్ పెట్టుకోవాలని, హ్యాండ్‌గ్లోజ్ వేసుకోవాలని, ఎర్త్ రాడ్ వేయాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా అన్న విషయాలను యాప్ గుర్తు చేస్తోంది. వీటన్నింటినీ సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఆ ఫొటోను యాప్ ద్వారా లైన్‌మెన్ చూసుకుని అందులో కనిపిస్తున్న ఫీడర్, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా అని ధ్రువీకరించుకుని పనికి ఉపక్రమించాల్సి ఉంటుంది. లైన్‌మన్ ఎంత మంది సిబ్బంది చేత పని చేయిస్తున్నారో వారి పేర్లను యాప్‌లో పొందుపర్చాలి. పని పూర్తికాగానే ఆ పనికి సంబంధించిన ఫొటో, సిబ్బంది వచ్చారా లేదా అని యాప్‌లో నమోదు చేసి, ఎల్‌సీ రిట్నర్ చేయాలి. ఆపరేటర్‌కు యాప్ ద్వారా ఎల్‌సీ రిట్నర్ ఆదేశాలు వెళ్తాయి. అప్పుడు సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఎల్‌సీ రిట్నర్ చేసే సమయంలో ఎర్త్‌రాడ్ తీసారా, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా అని యాప్ అడుగుతోంది. ఏఈ ఆదేశాల మేరకు ఆ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తారు. ఇప్పటికే విద్యుత్ ఉద్యోగులకు, సిబ్బందికి ఈ యాప్ పనిచేసే విధానంపై శిక్షణనందించారు.




### భద్రతా ప్రమాణాలు పెంచడానికి యాప్



విద్యుత్ వినియోగదారులకు మరింత ఉత్తమ సేవలు అందించడంలో భాగంగా భద్రతా ప్రమాణాలను పెంచడానికి ప్రత్యేకంగా ఎల్‌సీ యాప్‌ను టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ రూపొందించింది. ఎల్‌సీ యాప్ ద్వారా విద్యుత్ అంతరాయాల సమయాలు, మానవ తప్పిదాలను నివారించవచ్చు. అలాగే అనవసరమైన ఎల్‌సీలను తగ్గించవచ్చు.

– శంకర్, ఎస్ఈ మెదక్

## కేన్సర్+కరోనా = కాంగ్రెస్

- బ్రిటీష్ జాతీయుడు స్థాపించిన పార్టీ కాంగ్రెస్
- రాహుల్‌గాంధీ మెప్పు కోసమే రేవంత్ ప్రగల్భాలు
- ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్, కరోనా కలిస్తే కాంగ్రెస్ పార్టీ అని ఎమ్మెల్సీ అంజిరెడ్డి విమర్శించారు. సంగారెడ్డి శివారులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీపై రేవంత్‌రెడ్డి గుజరాత్‌లో చేసిన ఆరోపణలు ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఓ బ్రిటిష్ జాతీయుడు కాంగ్రెస్ పార్టీని స్థాపించిన విషయం సీఎం మర్చిపోయినట్టు ఉన్నాడని ఎద్దేవా చేశారు. చరిత్ర మర్చిపోయి విమర్శలు చేయడం తగదన్నారు. తెలంగాణలో బీజేపీని అడుగుపెట్టనీయబోమని రేవంత్‌రెడ్డి మాట్లాడడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 8 స్థానాలు, నిన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలు బీజేపీకి ప్రజలు పట్టం కట్టారని అంజిరెడ్డి గుర్తుచేశారు. సాక్షాత్తు తన సొంత జిల్లాలోని ఎంపీ స్థానాన్ని, ఆయన సిట్టింగ్‌గా ఉన్న మల్కాజిగిరి ఎంపీ సీటులో బీజేపీ ఘన విజయం సాధించిందన్నారు. సొంత జిల్లాలో ఎంపీ స్థానాన్ని గెలిపించుకోలేని అసమర్థుడు రేవంత్ అని అన్నారు. జాతీయవాద, దేశభక్తి భావాలు కలిగిన బీజేపీపై అవాకులు, చవాకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. మజ్లిస్, బీఆర్ఎస్‌తో కుమ్మక్కై కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చేస్తోందని ఆయన విమర్శించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీని గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని నిలబెట్టలేదని, అయినప్పటికీ బీజేపీ విజయం తథ్యమన్నారు. బీజేపీపై రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు విమర్శలు మానుకొని ఆరు గ్యారెంటీల అమలు, ప్రజాసమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని అంజిరెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా గావ్ చలో-బస్తీ చలో కార్యక్రమాలు చేయాలని పార్టీ పిలుపునిచ్చిందని, ప్రతీ కార్యకర్త పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు దేశ్‌పాండే, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటనరసింహారెడ్డి, మల్లికార్జున్‌పాటిల్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మీనాగౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి తదితరులు పాల్గొన్నారు.

# కనులపండువగా రథోత్సవం

**ఇందుప్రియాల్, మంగంపేటలో ఘనంగా బ్రహ్మోత్సవాలు**

దౌల్తాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇందుప్రియాల్ గ్రామంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా గురువారం స్వామివారు రథంపై ఊరేగారు. ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. రాములోరి రథోత్సవం గ్రామ పురవీధుల గుండా ముందుకు సాగగా, మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఆలయ ధర్మకర్త అన్నారెడ్డి సుభాష్‌రెడ్డి దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆలయంలో సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించి రథోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్యామల కుమార్, ఎంపీటీసీ వీరమ్మ మల్లేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు..



జిన్నారం : రథోత్సవంలో నాయకులు, భక్తులు

**మంగంపేటలో..**

జిన్నారం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని మంగంపేటలో గురువారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామ ప్రధాన వీధుల్లో రథోత్సవం కొనసాగింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశం గౌడ్, రాజేష్, గంగు రమేష్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గణేష్, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



దౌల్తాబాద్: ఇందుప్రియాల్‌లో రథాన్ని లాగుతున్న ఆలయ చైర్మన్ సుభాష్‌రెడ్డి, భక్తులు

## సింహవాహనంపై లక్ష్మీనరసింహస్వామి

బెజ్జంకి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : బెజ్జంకి లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి సింహవాహన సేవను నిర్వహించారు. అర్చకులు ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని సింహవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మంగళహారతులు ఇచ్చి, కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.



బెజ్జంకిలో పురవీధుల్లో సింహ వాహనంపై ఊరేగుతున్న నృసింహుడు



### కారముంగిలో కుస్తీ పోటీలు

మండల పరిధిలోని కారముంగి గ్రామంలో మహాదేవ జాతర ఉత్సవాలలో భాగంగా గురువారం కుస్తీ పోటీలను నిర్వహించారు. -నాగల్‌గిద్ద, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు పింఛన్ పెంచారు.. రేవంత్‌రెడ్డి ఇవ్వకపోతే

# గద్దె దిగిపోయే రోజు తీసుకువస్తా

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

చేర్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో సీఎం చంద్రబాబు పింఛన్ల పెంపుపై చిత్తశుద్ధి చాటుకున్నారని, కానీ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పక్కవారిపై నిందలు మోపుతూ కాలం వెల్లదీస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. రేవంత్ ఇక్కడ పింఛన్ పెంచి ఇవ్వకపోతే తప్పక తప్పక గద్దె దించే రోజు తీసుకువస్తానని అన్నారు. చేర్యాల మండలం షబాషీగూడెం గ్రామంలో గురువారం రాత్రి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో పింఛన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల హామీ మేరకు చంద్రబాబు జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచిన పింఛన్ డబ్బులు అందిస్తున్నారన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి 16 నెలలైనా రూ.4వేలు పింఛన్ అమలు చేయలేదన్నారు. పేదలకు మేలు జరగాలని తాను చేసే ఏ పోరాటానికైనా ప్రజలు అండగా నిలబడాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, వర్గీకరణ పోరాటం కేవలం మాదిగల కోసమే కాదని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలు అందరి దరిచేరడం కోసమేనన్నారు. తాము మాలలు, రెడ్లు, అగ్ర వర్ణాలకు వ్యతిరేకం కాదని, అన్ని వర్గాల సహకారంతో వర్గీకరణ సాకారమైందన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 'మేమెంతో మాకంత' నినాదం ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటం ఎనలేనిదన్నారు. తెలంగాణ ఉద్యమం మాదిరిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, నిర్బంధాలకు గురైనా వెనకడుగు వేయకుండా మూడు దశాబ్దాలుగా చేపట్టిన పోరాటం ఫలించడం హర్షించదగిందన్నారు. అసమానతలు తొలగి దళితుల జీవితాలలో వెలుగులు నింపిన సూర్యుడుగా నిలిచిన మంద కృష్ణ పోరాటం ఎందరికో ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ము రవి, సీపీఎం జిల్లా నాయకుడు కొంగరి వెంకట్‌మావో, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



షబాషీగూడెంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంద కృష్ణమాదిగ, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

### బాబు జగ్జీవన్‌రామ్ బాటలో నడవాలి

కుకునూరుపల్లి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రామ్ బాటలో నడవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తెలిపారు. బుధవారం చిన్నకిష్టాపూర్ గ్రామంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ఎస్సీ వర్గకరణ జరిగిందని వర్గీకరణతో మాదిగలకు న్యాయం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముంద్రాతి కృష్ణ, లక్ష్మణరాజు, మాజీ సర్పంచ్ కనకయ్య, కిషన్, సోమీ కరుణాకర్, సంపత్‌రెడ్డి, సంతోష్‌చారి, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు పంట కాలువ మరమ్మతు

రాయరావు చెరువు కాలువకు ఆక్రమణల నుంచి రక్షణ..వ్యర్థాల తొలగింపు పనులు ప్రారంభం





వ్యర్థాలతో అధ్వానంగా రాయరావు చెరువు పంట కాలువ, మరమ్మతు పనులను పరిశీలిస్తున్న డీఈఈ, ఏఈ

నర్సాపూర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణ పరిధిలోని రాయరావు చెరువు పంట కాలువ మరమ్మతుకు నిధులు మంజూరైన ఎన్నో ఏళ్ల తర్వాత పనులకు మోక్షం లభించింది. ఎట్టకేలకు వ్యర్థాలను తొలగించి, సిమెంట్ పనులను ప్రారంభించారు. నియోజకవర్గ పరిధిలో అతిపెద్ద చెరువులో ఈ చెరువు ఒకటి. దీని కింద ఐదువందల ఎకరాల ఆయకట్టు ఉంది. అయితే, చెరువు నుంచి సాగునీరు పారే పంట కాలువ ఇళ్ల మధ్య నుంచి ఉండటంతో ఆక్రమణకు గురవుతూ వచ్చింది. అంతేకాకుండా ఇళ్ల నుంచి డ్రైనేజీతో పాటు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కాలువలోనే వేస్తుండటంతో మురుగు కాల్వగా తయారైంది. ఇన్నాళ్లు నిర్వాహణ లేక కుచించుకపోయి పంటలకు సాగు నీరందించలేకపోయారు. ఆరేళ్ల క్రితం పంట కాలువ ఆక్రమణ గురికాకుండా, వ్యర్థాలు చేరకుండా పటిష్ట చర్యలు చేపట్టడానికి రూ.13 లక్షల నిధులను మంజూరు చేశారు. వివిధ కారణాలతో నిధులు కాంట్రాక్టు పనులను ప్రారంభించ లేదు. 'ఆంధ్రజ్యోతి'లోనూ ఈ విషయమై గతంలో పలు మార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. స్థానికులు, రైతుల నుంచి విమర్శలు వస్తుండటంతో ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు స్పందించి పనులను చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం కాలువకు ఆర్‌సీసీ వేయడమే కాకుండా ఆక్రమణల నుంచి రక్షణగా ఇరువైపులా పెన్సింగ్ వేస్తున్నారు. ఎన్నో రోజులుగా పట్టించుకోకుండా అధ్వానంగా మారిన కాలువ మరమ్మతు పనులకు మోక్షం లభించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కాలువ పనులను డీఈఈ బుచ్చిబాబు, ఏఈ మణిభూషణ్ పరిశీలించారు.

## విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను పడేయొద్దు

- తడి, పొడి చెత్తను వాహనానికి ఇవ్వాలి
- సిద్దిపేట డీపీవో దేవకీదేవి

సిద్దిపేట రూరల్, ఏప్రిల్10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వినియోగించిన ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా పారేస్తున్నారని, అలా చేయడం వల్ల అనేక అనర్థాలు తప్పవని సిద్దిపేట జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) దేవకీదేవి తెలిపారు. గురువారం ఆమె నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది, మల్యాల గ్రామాల్లోని డంపింగ్ షెడ్లు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇంట్లోని తడి, పొడి చెత్తను గ్రామ పంచాయతీకి చెందిన చెత్త వాహనానికి అందజేయాలని చెప్పారు. తద్వారా రీసైక్లింగ్ చేయడం జరుగుతుందన్నారు. నర్సరీల్లో త్వరగ పెరిగే మొక్కలకు పెంచి ప్రజలకు అందించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఆరోగ్యపరంగా మేలు చేసే మునుగ, బొప్పాయి, వంగ మొక్కలు కుడా పెంచాలని సూచించారు. ఆమె వెంట ఎంపీవో శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శులు మునీరుద్దీన్, అరుణ తదితరులు ఉన్నారు.



గుర్రాలగొందిలో సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న డీపీవో

# ప్రణాళిక లేని పనులు.. ప్రజలకు వెతలు

● చేర్యాలలో చిన్నపాటి చినుకులకే కుంటలా మారుతున్న అంగడిబజారు చౌరస్తా ● ఇతర మండలాలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి



అంగడి బజారు చౌరస్తాలో రోడ్డుపై గుంతల్లో నిలిచిన వరదనీరు

చేర్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అవగాహన లేమితో అధికారులు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ప్రజలకు శాపంగా పరిణమించాయి. చేర్యాల పట్టణంలోని అంగడిబజారు చౌరస్తా చిన్నపాటి వర్షానికే కుంటను తలపిస్తుంది. చిన్న వర్షం కురిస్తే చాలు వరదనీరు చేరి రోజుతరబడి నిల్వ ఉండటంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూడలి ప్రాంతంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డి కొమురయ్య, తెలంగాణ తల్లి, అమరవీరుల స్మారక స్థూపాలతో పాటు ఎస్‌బీఐ బ్యాంకు, కూరగాయలు, పండ్ల విక్రయ దుకాణాలు, చిరు వ్యాపారులు ఉండటంతో నిత్యం ఈ ప్రాంతం రద్దీగా ఉంటుంది.

### ప్రణాళిక లేమితో అస్తవ్యస్తం

చేర్యాల పట్టణంతో పాటు ధూళిమిట్ట, మద్దూరు, నంగునూరు, హుస్నాబాద్ తదితర మండలాలకు వెళ్లాలంటే అంగడిబజార్ చౌరస్తా నుంచే ప్రయాణించాల్సి ఉంటుంది. ఆర్టీసీ రిక్వెస్ట్‌స్టాప్ ఉన్నందున ఎల్లప్పుడూ రద్దీ ఎక్కువే ఉంటుంది. కొద్దిరోజులక్రితం జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల కారణంగా ఎత్తులేపి ప్రణాళికాలేమితో చర్యలు చేపట్టారు. దీంతో అంగడిబజారు చౌరస్తా దారి లోతట్టుమయమై చిన్నపాటి వర్షంకురిసినా చౌరస్తావద్ద వరదనీరు చేరుతూ దారి దెబ్బతిని గుంతలమయమైంది. గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి నీరుచేరి నిల్వ ఉండటంతో ప్రజలు, వాహనదారులు నానాతంటాలుపడ్డారు. అపరిశుభ్ర వాతావరణానికి తోడు దోమలు స్వైరవిహారం చేస్తుండటంతో బెంబేలెత్తిపోతున్నారు.

### వరదనీటిలో సీపీఐ నిరసన

అంగడి బజారుచౌరస్తాలో వరదనీరు నిల్వ ఉండటంతో సీపీఐ నాయకులు గురువారం నిరసన చేపట్టారు. అంగడి బజారు చౌరస్తా సుందరీకరణ చేపట్టాలని, వరదనీటి ఇక్కట్లు తొలగించేందుకు మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతి నిధులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అందెఅశోక్, ఈరు భూమయ్య, కుడిక్యాల బాలమోహన్, జంగిలి యాదగిరి, మమత, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.



## వేలం ద్వారా రేణుకా ఎల్లమ్మ ఆలయానికి రూ. 12.89లక్షలు

హుస్నాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జాతర సందర్భంగా గురువారం కొబ్బరి కాయలు, పూజా ద్రవ్యాలు, చీరలు, కనుములు, బియ్యం పోగు చేసుకునేందుకు ఆలయ ప్రాంగణంలో వేలం నిర్వహించారు. వేలం ద్వారా రూ. 12.89 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈవో కిషన్‌రావు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పి విజయలక్ష్మి తదితరులున్నారు.

## స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హుస్నాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి కోర్సుల శిక్షణకు ధరఖాస్తు చేసుకోవాలని సెట్విన్ ట్రైనింగ్ ఇనిస్ట్యూట్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో మున్సిపల్ కాంప్లెక్స్‌లో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్, పేయింటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, ప్రి ప్రైమరీ టీచర్ ట్రైనింగ్, మోహందీ, బ్యూటిషియన్ కోర్సు, కంప్యూటర్, ఎలక్ట్రీషియన్, రిఫ్రిజిరెటర్, ఎయిర్ కండిషన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు సెట్విన్ యువజన శాఖ సమన్వయ కర్త అమీనాభాను తెలిపారు.

## సర్కారు బడుల్లోనే చేర్పించాలి

అక్కన్నపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించాలని ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి కోరారు. గురువారం అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

## ఘనంగా మహావీర్ జయంతి

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిస్టరీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వర్ధమాన మహావీరుని జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ శ్రద్ధానందం, నాగేశ్వర రావు, మామిడి కొండల్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. గౌతమ బుద్ధుడి బోధనల చేత అప్పటి సమాజంలో ఉన్న ఆర్థిక అసమానతలు, సాంఘిక దురాచారాలను నిర్మూలించడంలో వర్ధమాన మహావీరుడు తన వంతు పాత్రను పోషించారన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, గణేష్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నీటిని వృథా చేయొద్దు

గజ్వేల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, వృథా చేయొద్దని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య కోరారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులలో నీటి అంతరాయం ఏర్పడుతున్న ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఆయనవెంట సానిటరీ ఇన్స్‌పెక్టర్ రవిందర్, ఇతర సిబ్బంది, జవాన్లు ఉన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

గజ్వేల్/గజ్వేల్ రూరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని గజ్వేల్ మార్కెట్ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, ఫాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశ్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి మాజీ ఎంపీటీసీ అంజీయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అక్కారం యాదగిరి, ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చంద్రారెడ్డి, పంచాయతీ సెక్రెటరీ శ్రీకాంత్, హమాలీ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ మండలం ధర్మారెడ్డిపల్లి గ్రామంలో ఫాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఫాక్స్ చైర్మన్ జేజాల వెంకటేశ్‌గౌడ్ మాజీ వైస్ ఎంపీపీ బెల్దే కృష్ణాగౌడ్‌తో కలసి ప్రారంభించారు.

## అంగన్‌వాడీ సెంటర్లలో పోషకాహారంపై అవగాహన



గజ్వేల్ మండలం సింగాటంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీవో సరిత

గజ్వేల్ రూరల్/చిన్నకోడూరు/నంగునూరు/మద్దూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన పోషణ పక్వాడ కార్యక్రమం గురువారం జిల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది మాట్లాడుతూ.. అందుబాటులో ఉండే పోషక విలువలు గల ఆకుకూరలు, చిరుధాన్యాలు, పండ్లు తీసుకోవాలని వాటితోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని మహిళలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రు పాలు పట్టించాలని, ఆరు నెలలు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. గజ్వేల్ మండలంలోని సింగాటం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడలో భాగంగా గర్భిణులకు మొదటి వెయ్యి రోజులలో పాటించాల్సిన పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీవో సరిత మాట్లాడుతూ.. గర్భిణులు మొదటి వెయ్యి రోజుల్లో తీసుకోవలసిన వ్యక్తిగత పరిశుభ్రత, పౌష్టికాహారం గురించి వివరించారు. చిన్నకోడూరు మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్ స్కూల్‌లో గురువారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో శారద మాట్లాడుతూ.. చిరు ధాన్యాలను తీసుకోవడం ద్వారా మంచి పోషకాలు లభిస్తాయని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఎం ఆంజనేయులు, పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. నంగునూరు మండలం జేపీ తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప మాట్లాడుతూ.. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యేంతవరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కనకలక్ష్మి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.మద్దూరు మండలంలోని మర్మాముల గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు మిల్లెట్స్ గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సువర్ణసన్, టీచర్ జయశ్రీ, చంద్రకళ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



మండల దీక్షా కార్యక్రమంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్ స్వామిజీ

గజ్వేల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అఖిల భారత హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణ శివారులోని నల్లవాగు గడ్డ కేసరి హనుమాన్ ఆలయ ఆవరణలో హనుమాన్ మండల దీక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి స్వామీజీ మాట్లాడుతూ భక్తి భావంతో ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు జయసింహ, శ్రీనివాస్ గుప్తా, పిచ్చయ్య, కుమారస్వామి తదితరులున్నారు.

## సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలి




కుందనవానిపల్లిలో రైతులకు డ్రమ్ములు పంపిణీ చేస్తున్న ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి

అక్కన్నపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం సాగు చేయాలని లోడి సాంఘిక సేవాసంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ బాలశౌరి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కుందనవానిపల్లిలో సేంద్రియ ఎరువులు తయారు చేయడం కోసం 200 మంది రైతులకు డ్రమ్ములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. సేంద్రియ పద్ధతిలో అధిక దిగుబడులు సాధించే విధానంపై రైతులకు వివరించారు. ఇందులో ప్రాజెక్టు మండల ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ, ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## 'కల్యాణలక్ష్మి' ఇవ్వకపోతే ఫాంహౌస్ ముట్టడిస్తాం

గజ్వేల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేయని పక్షంలో ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌ను, గజ్వేల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు పంజాల అశోక్‌గౌడ్ హెచ్చరించారు. గజ్వేల్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న 832 కళ్యాణలక్ష్మి చెక్కులను వెంటనే అర్హులకు పంపిణీ చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం గజ్వేల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. లబ్ధిదారులు ఆరు నెలలుగా చెక్కులు అందక ఆర్డీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని, వారిని పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ఎమ్మెల్యేగా గెలిపించిన కేసీఆర్ వారి సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. కళ్యాణలక్ష్మి, చెక్కులను పంపిణీ చేసేలా కేసీఆర్ అధికారులతో మాట్లాడాలని, లేని పక్షంలో లబ్ధిదారులతో కలిసి బిజెపి ఆధ్వర్యంలో క్యాంప్ ఆఫీస్‌ను, ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాములు, ఎల్కంటి సురేష్, నత్తి శివకుమార్, చెప్యాల తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు: బీఆర్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న పాల సాయిరాం

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 'మందుల్లేవ్' అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన కథనంపై బీఆర్ఎస్ నాయకులు స్పందించారు. ఈ మేరకు సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపారు. సమావేశంలో రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మాజీ సభ్యుడు పాల సాయిరాం మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిని మాజీమంత్రి హరీశ్‌రావు అన్ని రకాలుగా అభివృద్ధి చేయడంతో ఆసుపత్రికి బ్రాండ్ ఇమేజ్ ఉండేదని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు పేద ప్రజలకు కనీస వైద్యం కూడా అందడంలేదని మండిపడ్డారు. ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉండాల్సిన మందులు కూడా డిస్పెన్సరీలో లేకపోవడం బాధాకరమన్నారు. రోగుల అటెండర్లకు కనీస టాయిలెట్ సౌకర్యాలు కూడా లేవని వీటిని వెంటనే మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్య వైఖరిని వీడాలన్నారు. ఇప్పటికైనా మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టాలని లేదా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు. సమావేశంలో కౌన్సిలర్లు సుందర్, మణిదీప్‌రెడ్డి, నాయకులు మోహిజ్, నాగరాజు, సయ్యద్, కంఠం రాజు, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్లాపూర్‌లో ఉచిత పశు వైద్య శిబిరం

చిన్నకోడూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చంద్లాపూర్ శివారులో గల పశుసంవర్ధక పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక పశువైద్యశిబిరం నిర్వహించారు. పశు సంవర్ధకశాఖ వారి సహకారంతో జాతీయ సేవా పథకంలో(ఎన్ఎస్ఎస్) భాగంగా నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 3 వేల జీవాలకు (గొర్రెలు, మేకలకు) ఉచితంగా టీకాలు వేసి, 25 పశువులకు చూడి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పరశురాం, మాజీ ఎంపీటీసీ దుర్గారెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు, రైతులు, పశు సంవర్ధక శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగంపై బీజేపీ కుతంత్రాలను ఎండగట్టడానికే పాదయాత్ర



సిద్దిపేటలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు




కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్‌లో కాంగ్రెస్ సంవిధాన్ ర్యాలీ



మద్దూరు: మర్మాముల గ్రామంలో కాంగ్రెస్ పాదయాత్ర

సిద్దిపేట టౌన్/సిద్దిపేట రూరల్/చేర్యాల/మద్దూరు/ధూళిమిట్ట/జగదేవ్‌పూర్/నంగునూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంపై బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుతంత్రాలను ప్రజలకు తెల్పడమే రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర అని కాంగ్రెస్ నాయకులు పునరుద్ఘాటించారు. గురువారం జిల్లాలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లకు ముప్పు తెచ్చే కుట్రలను పన్నుతోందని, కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టే యత్నం చేస్తుందని, దీన్ని ప్రజలందరూ గమనించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట పట్టణంలో చేపట్టిన సంవిధాన్ పాదయాత్ర స్థానిక 31, 32, 43వ వార్డులలో కొనసాగింది. పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మనందరం కలిసి పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు. వారి వెంట కౌన్సిలర్ పయ్యావుల ఎల్లం పూర్ణిమ, నాయకులు వహబ్, బైరి సాయిలు తదితరులు ఉన్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గం ఇన్‌చార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పాదయాత్రలో పార్టీ మండల అధ్యక్షుడు రాములు, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి మండలం లెనిన్‌నగర్, మర్రిముస్త్యాల గ్రామాల్లో కాంగ్రెస్ సంవిధాన్‌యాత్రలో పార్టీ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, నాయకులు సనాది భాస్కర్, లింగంపల్లి శ్రీనివాస్, చెరుకు రమణారెడ్డి, కాయిత శ్రీనాథ్ రెడ్డి, జంగని రవి తదితరులు పాల్గొన్నారు. మద్దూరు మండలంలోని లద్నూరు, మర్మాముల గ్రామాల్లో నిర్వహించిన పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్యాల మనోహర్, నాయకులు పాల్గొన్నారు. దూళిమిట్ట మండల కేంద్రంతో పాటు లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో ఇన్‌చార్జి కుమార స్వామి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గిరికొండల్ రెడ్డి, మండల అధ్యక్షుడు కోల సాయిలు గౌడ్, కమలాకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని అనంతసాగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో మహనీయుల చిత్రపటాలతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ కాంగ్రెస్ నాయకులు సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేష్, నాయకులు మల్లేశం, భాస్కర్‌రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. నంగునూరు మండలం ఖాత, ఘనపూర్, సిద్దన్నపేట గ్రామాల్లో పీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి ఆధ్వర్యంలో పయ్యావుల ఎల్లంతో కలిసి సంవిధాన్ యాత్ర చేపట్టారు.

## రెండు ఆటోలు ఢీ.. ఆరుగురికి తీవ్ర గాయాలు

హుస్నాబాద్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని బస్‌డిపో రోడ్డులో గురువారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ఆటోలు ఢీ కొన్న ఘటనలో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణంలోని ఆరెపల్లి నుంచి బస్టాండ్‌కు వస్తున్న ఆటో, అనభేరి చౌరస్తా నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీ కొనడంతో హుస్నాబాద్‌కు చెందిన మేడవేని విజయ్, కరీంనగర్‌కు చెందిన ములుగు దిలీప్, జాల గణేశ్, హన్మకొండ జిల్లా వేలేరుకు చెందిన సుంకనపల్లి మణికంఠ, జాల శివప్రసాద్, కాజీపేటకు చెందిన జాల లవన్‌కుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విజయ్, మణికంఠలకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించినట్లు ఎస్ఐ తోట మహేశ్ తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో 17మందికి జరిమానా.. ఇద్దరికి జైలు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 17 మందిని గురువారం ఆయా కోర్టుల్లో ప్రవేశపెట్టగా న్యాయధికారులు నిందితులకు జరిమానా, ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో ఐదుగురు పట్టుబడ్డారు. నిందితులను సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా రూ.8వేల జరిమానా విధించారు. ఒకరికి జరిమానాతో పాటు 3 రోజుల జైలుశిక్ష విధించారు. అదే విధంగా చేర్యాలలో ఇటీవల పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో 12 మంది మద్యం తాగి డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డారు. నిందితులను చేర్యాల మున్సిఫ్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి కృష్ణతేజ్ ఎదుట కోర్టులో ప్రవేశపెట్టగా రూ.45వేలు జరిమానా విధించారు. ఒకరికి 7 రోజుల జైలుశిక్ష విధించారు.

## ప్రజలకు భద్రత కల్పించేందుకే కార్డన్ సెర్చ్



వాహనం తనిఖీ చేస్తున్న ఎస్ఐ అపుర్వారెడ్డి

సిద్దిపేట రూరల్,ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి); ప్రజల సమస్యలు తెలుసుకుని, వారిలో భద్రతాభావం కలిగించేందుకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్టు రూరల్ సీఐ శ్రీను తెలిపారు. గురువారం రాత్రి నారాయణరావుపేట మండల కేంద్రంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నార్కటిక్స్ డాగ్స్‌తో అనుమానాస్పద ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీఐ శ్రీను మాట్లాడుతూ యువత గంజాయి,డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐలు గుడ అపూర్వారెడ్డి, పరుశురాం, మల్లేశం, రాజేశం, డాగ్‌స్కాడ్ సిబ్బంది ఉన్నారు.

## నిషేధిత మాదకద్రవ్యాలపై అవగాహన

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నిషేధిత మాదకద్రవ్యాల పట్ల సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పవనసంధ్య కార్యక్రమంలో పాల్గొని ఉపయోగకరమైన, హానికరమైన మాదకద్రవ్యాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల వచ్చే అనర్థాలు గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి సునీత, వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ మెంబర్ జి బాలకిషన్ ఐక్యుఏసీ కోఆర్డినేటర్ మధుసూదన్, సీఈవో గోపాల సుదర్శనం, యాంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ వి బాలకిషన్, కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రద్ధానందం, విశ్వనాథం, రాణి పుణ్యమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కానిస్టేబుళ్ల కుటుంబాలకు చెక్కులు



కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న సీపీ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది డిసెంబర్ నెలలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుళ్లు పరంధాములు, వెంకటేష్ కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ తరపున ఒక్కో కుటుంబానికి రూ.16లక్షల చొప్పున మొత్తం రూ.32లక్షల విలువైన చెక్కులను సీపీ డాక్టర్ బి అనురాధ గురువారం అందజేశారు. అనంతరం వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తదితర అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబాలకు డిపార్ట్మెంట్ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏవో యాదమ్మ, బి సూపరిండెంట్ అలీషా నిమ్మల ఎస్బి ఇన్స్పెక్టర్ కిరణ్, జూనియర్ అసిస్టెంట్ రవిరాజు, సీసీ నితిన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో 5వ తరగతి చదువుతున్న బోనాల ఆద్య అనే విద్యార్థిని ఐఎన్టీఎస్‌వో ఎడ్యుకేషన్ ఇంగ్లిష్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు గోల్డ్‌మెడల్ సాధించి మెరిట్ సర్టిఫికెట్, గోల్డ్‌మెడల్, ట్యాబ్ సాధించింది. దీంతో గురువారం సీపీ అనురాధను అభినందించారు.

## జీపీఏ విధానంలో ఫలితాలు ప్రకటించాలి

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి: ఈ సంవత్సరం పదో తరగతి పరీక్ష ఫలితాలను జీపీఏ విధానంలోనే ప్రకటించాలని తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (బిస్మాట్ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి డిమాండ్ చేశారు. బిస్మాట్ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డిని కలిసి మెమోరాండం సమర్పించారు. అనంతరం బిస్మాట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పదో తరగతి విద్యార్థులకు జీపీఏ పద్ధతి ద్వారా విద్యాబోధన జరిగినప్పటికీ, ప్రభుత్వం విద్యా సంవత్సరం చివరలో జీపీఏ పద్ధతి రద్దు చేస్తూ, మార్కుల విధానంలో ఫలితాలను ఇస్తామని జీవో జారీ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. మార్కుల విధానం వల్ల కార్పొరేట్ పాఠశాలలకు మాత్రమే లాభం చేకూరుతుందన్నారు. కాబట్టి మార్కుల విధానం రద్దు చేసి పాత జీపీఏ విధానంలోనే పది ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. దీనిని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి, సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో బిస్మాట్ జిల్లా ప్రతినిధులు సంపత్ కుమార్, భగవాన్ రెడ్డి, బాలకృష్ణ, సికిందర్, షేక్ సయ్యద్ పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి



గజ్వేల్‌లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు తూంకుంట అంక్షారెడ్డి డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ నాయకులతో కలసి గురువారం గజ్వేల్ పట్టణంలో భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సమీర్, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు నిరసనలో పాల్గొన్నారు.

● చేర్యాల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ ధర పెంపునకు నిరసనగా గురువారం చేర్యాలలో సీపీఐ నాయకులు ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట జాతీయరహదారిపై ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్, నాయకులు ఈరు భూమయ్య, కుడిక్యాల బాలమోహన్, జంగిలి యాదగిరి, పొన్నబోయిన మమత పాల్గొన్నారు.